క్లుప్తంగా

ఎమ్మెల్యే గిరిధర్ ఎన్నికల ప్రచారం



పట్నంబజారు: మన ఇంటి ఆడపడుచు రజినమ్మను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మద్దాళిగిరిధర్ పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం 19వ డివిజన్ నల్లచెరువులో 11వలైను నుంచి 2వలైను వరకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి సీఎం జగనన్నకు తోడుగా నిలువాలని ప్రచారం చేపట్టారు. ఎమ్మెల్యే మద్దాళిగిరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి మేలు చేసి తన వల్ల మంచి జరిగితేనే ఓటు వేయండని అడిగిన ముఖ్యమంత్రిని రాష్ట్ర రాజకీయాల్లో మొట్టమొదటగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని చూస్తున్నామన్నారు. కేవలం ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి అవి పూర్తి అవగానే వాటిని మరిచిపోయే నేతలను చూశామని, మంచి చేస్తున్న జగనన్నకు అండగా నిలబడాలన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని గెలుపు మనందరి గెలుపు అన్న విషయాన్ని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు నేరేళ్ల సురేష్, గుడిపాటి భాస్కర్, మల్లవరపు బుజ్జి, జిలానీ, నాగూర్, సోమి కమల్, ఇస్మాయిల్, జానీ, బాలరాజు, సుభాని, సుజాత, బాలయ్య, అంజనా, ఫాతిమా పాల్గొన్నారు.

49వ డివిజన్‌లో న్యాయవాదులు..



నగరంపాలెం: వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ అభ్యర్థి, మంత్రి విడదల రజిని విజయాన్ని కాంక్షిస్తూ జిల్లా న్యాయవాదులు శనివారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో 49వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ బోడపాటి ఉషారాణితో కలసి గడప గడపకు వెళ్లి ఓటర్లను ఓటు అభ్యర్థించారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గుర్తు ఫ్యాన్‌కే ఓటేయాలని ఓటర్లను కోరారు. ఐదేళ్లల్లో వైఎస్సార్ సీపీ అమలు చేసిన సంక్షేమ పథకాలతో పాటు 2024 ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి పోలూరి వెంకటరెడ్డి, జిల్లా అధ్యక్షుడు సీడీ భగవాన్, న్యాయవాదులు సయ్యద్‌బాబు, కృష్ణారెడ్డి, పచ్చల అనిల్, కుమార్‌రాజా, రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, వరదాయిని, వెంకట్రావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీ కృష్ణార్జునయుద్ధం ప్రదర్శన

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలోని అన్నమయ్య కళావేదికపై శనివారం రాత్రి శ్రీకృష్ణార్జున యుద్ధం పౌరాణిక పద్య నాటకం ప్రదర్శించారు. ఈశ్వర వరప్రసాద పరిషత్ సౌజన్యంతో శ్రీలక్ష్మీ నరసింహ నాట్యమండలి ధర్మపురి ఆధ్వర్యంలో చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు రచయితగా, డాక్టర్ సంగనభట్ల నరసయ్య దర్శకత్వం వహించారు. శ్రీకృష్ణుడిగా డాక్టర్ నరసయ్య, అర్జునుడిగా నరహరి శర్మ, గయుడు, సాచ్చకిగా బొజ్జ రాజగోపాల్‌శర్మ, నారదుడిగా సంగనభట్ల రామకష్టయ్య పాత్రధారులుగా వ్యవహరించారు. పుడమి గ్రూపు చైర్మన్ ముత్తవరపు సురేష్ మాట్లాడుతూ నాలుగు తరాలుగా ఒకే సంస్థ పౌరాణిక నాటకం ప్రదర్శించడం తెలుగు ప్రేక్షకుల అదృష్టమని అన్నారు. అనంతరం పాత్రధారులను, సాంకేతిక నిపుణులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ రంగస్థల సినీ నటులు, దర్శకుడు వైఎస్ కృష్ణేశ్వరరావు, దేవస్థానం పాలక మండలి అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, సాహిత్యవేత్త మోదుగుల రవికృష్ణ, సెట్లం చంద్రమోహన్ పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో ఉద్రిక్తత

లక్ష్మీపురం: రైలులో గో మాంసం సరఫరా చేస్తున్నారని ఆరోపిస్తూ శైవ క్షేత్ర పీఠాధిపతి శివస్వామి ఆయన భక్తులతో కలసి గుంటూరు రైల్వే స్టేషన్‌లో శనివారం నిరసనకు దిగారు. రైల్వే స్టేషన్‌లో కొంత సేపు ఉద్రిక్తత నెలకొంది. నిబంధన మేరకు ఇక్కడ పార్సిళ్లు తెరవడం కుదరదని హైదరాబాద్ వెళ్లాలని సర్దిచెప్పారు. రైలును యథావిధిగా పంపించి వేశారు.

సంక్షేమ పథకాలు ఆపేసే కుట్ర

- జగనన్న మళ్లీ గెలిస్తే పథకాల కొనసాగింపు
- ఇప్పటికే పింఛన్ల విషయంలో బుద్ధి బయటపెట్టుకున్న టీడీపీ
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- 25వ డివిజన్‌లో మనతో మన రజినమ్మ కార్యక్రమం
- హాజరైన ఎమ్మెల్సీలు అప్పిరెడ్డి, ఏసురత్నం

పట్నంబజారు: వచ్చే ఎన్నికల్లో అప్రమత్తంగా ఉండకపోతే.. ఈ రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేసే శక్తులు అధికారంలోకి వచ్చే ప్రమాదం ఉందని, ఇప్పటికే సంక్షేమ పథకాలన్నీ ఆపేసే ఎత్తుగడలో టీడీపీ ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ అభ్యర్థి విడదల రజిని పేర్కొన్నారు. స్థానిక 25వ డివిజన్‌లో శనివారం మనతో మన రజినమ్మ ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వస్తున్న సంక్షేమ పథకాలన్నీ ఇలాగే కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని చెప్పారు. చంద్రబాబునాయుడు సంక్షేమ పథకాలను నిలిపేసే కుట్రలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే పింఛన్లు వృద్ధులకు దక్కుండా చేశారని, ఇప్పుడు డీబీటీ ద్వారా అందుతున్న సంక్షేమ ఫలాలు కూడా దక్కకుండా అడ్డుకునే కుతంత్రాలకు తెరతీశారని దుయ్యబట్టారు.

చంద్రబాబు విషపు కౌగిలి..

శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు విషపు కౌగిలి గురించి అందరికీ తెలుసనని చెప్పారు. బాబు గత చరిత్ర తెలిసిన వారెవరూ ఆయనకు ఓట్లు వేయరన్నారు.



ప్రచారానికి హాజరైన స్థానికులు



ప్రచారంలో పాల్గొన్న మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీలు అప్పిరెడ్డి, ఏసురత్నం

జగనన్న సభలకు మిట్ట మధ్యాహ్నం మండుటెండల్లో కూడా జగనన్న సభలకు వస్తున్న జనాల్ని చూసి విపక్ష నేతలు బెంబేలెత్తుతున్నారని, ఓటమి భయం చంద్రబాబు, లోకేష్ మాటల్లో స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. అందుకే కుట్రలతో కూటములు కట్టి సిగ్గు ఎగ్గులేని రాజకీయాలు చేస్తున్నారని మండి పడ్డారు. ఎవరెన్ని కుట్రలు చేసినా వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమన్నారు.

చెప్పుకోవడానికి ఒక్క పథకం చంద్రబాబుకు లేదు

ఎమ్మెల్సీ ఏసురత్నం మాట్లాడుతూ 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన పెద్దమనిషి తనకంటూ చెప్పుకోవడానికి ఒక్క పథకం కూడా లేదని దుయ్యబట్టారు. చివరకు జగన్ చేసిన వన్నీ తానూ చేస్తానని, అంతకంటే ఎక్కువ చేస్తానని ఆయన చెబుతున్నాడంటే.. ఆయన మానసిక స్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని చెప్పారు. మొన్నటి వరకు వలంటీర్లను తిట్టిన వారే ఇప్పుడు ఆ వ్యవస్థను తామూ కొనసాగిస్తామంటున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఈనెల 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం అన్నారు. తొలుత 25వ డివిజన్ పరిధిలోని జోసఫ్ నగర్, కొత్తకాలనీ ప్రాంతాల్లో మంత్రి రజిని పర్యటించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కరుణ కుమారి పాల్గొన్నారు.

సంస్కరణల సారథి జగనన్న

- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- వైఎస్సార్ సీపీలోకి వలసల వెల్లువ

పట్నంబజారు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంస్కరణల సారథి అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. పలు పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు శనివారం స్థానిక శ్యామలానగర్‌లోని మంత్రి నివాసానికి చేరుకుని వైఎస్సార్ సీపీలో చేరారు. టీడీపీ, జనసేనల నుంచి దాదాపు 400 మంది వరకు చేరారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తు తరాల మేలు కోసం వైఎస్ జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు.

జనసేన నుంచి 30 మంది చేరిక

గుంటూరు శ్రీనివాసరావుతోటకు చెందిన 30 మంది యువకులు కార్పొరేటర్ గేదెల రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు మార్కొండా రెడ్డి ఆధ్వర్యంలో జనసేన పార్టీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి మంత్రి రజిని, మండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కనపర్తి మణికంఠ, ఉప్పర కొండ, పృథ్వీరాజ్, షరీఫ్, శ్రీను, నాగేశ్వరరావు, శివనాగేశ్వరరావు, కామాక్షి, పద్మావతి ఉన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వీరిశెట్టి సుబ్బారావు ఆధ్వర్యంలో 39వ డివిజన్ నుంచి టీడీపీ, జనసేన పార్టీల నుంచి 50 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. ఆయా పార్టీల బూత్ కన్వీనర్లు, బూత్ ఏజెంట్లు పోగుల శివప్రసాద్, సుంకర హైమారావు, షేక్ అల్లాభక్షు, షేక్ ఆశిష్, షేక్ ఆశిష్, షేక్ ఆసిఫ్ తదితరులు పార్టీలో చేరినవారిలో ఉన్నారు. 18వ డివిజన్ నుంచి స్థానిక కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేనల నుంచి వందమందికిపైగా కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ చేరారు. ఆర్.అగ్రహారం, అడపా బజార్ ప్రాంతాల నుంచి ఈ చేరికలు జరిగాయి. పార్టీలో చేరిన వారిలో పులిగడ్డ వాసు, శ్రీదేవి, తోట శ్రీనివాసరావు, పుప్పాళ్ల వెంకటేశ్వరరావు, బాసిన ఉమాదేవి, చందు శ్రీనివాసరావు, తెలగనీడి పద్మజ, తోట వెంకటేశ్వరరావు, తోట లక్ష్మీ చక్రపాణి, భాగ్యలక్ష్మీ, చందు ఇందిరా దేవి, పావని, మేకా ధనలక్ష్మీ, గాయత్రి, లీలావతి, కమల, రాజ, అనీల్, రోహిత్, మద్దూరి కొండారెడ్డి, అమనుల్లా ఖాన్ తదితరులు పార్టీలో చేరినవారిలో ఉన్నారు. జేసీఎస్ కన్వీనర్ సూరసాని వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని 24, 31 డివిజన్ల నుంచి మొత్తం 100 మంది వరకు టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. అఖిలభారత కాపు సమాఖ్య జిల్లా ఇన్‌చార్జి పసుపులేటి అంజలిదేవీ, ప్రసాద్, రమాదేవి, నందా, దరియాబి, చాందిని, మధుసూదనరావు తదితరులు పార్టీలో చేరినవారిలో ఉన్నారు.

20వ డివిజన్ నుంచి..

స్థానిక 20వ డివిజన్ నుంచి వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఖాజా మొహిద్దీన్ ఆధ్వర్యంలో 30 మంది టీడీపీ నుంచి పార్టీలో చేరారు. టీడీపీ డివిజన్ ఉపాధ్యక్షుడు మసూద్ ఖాన్‌తోపాటు షాహెద్‌ఖాన్, ఆబిద్ ఖాన్, అంజాద్‌ఖాన్, ఆరిఫ్ చేరిన వారిలో ఉన్నారు. స్థానిక మారుతీనగర్ నుంచి జనసేన, టీడీపీలకు చెందిన దాదాపు 40 మంది పార్టీలో చేరారు. పార్టీ సీనియర్ నాయకుడు షేక్ సైదా ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. సైదా ఆధ్వర్యంలో నాగుల్‌మీరా, కమల్‌భాషా, సంతోష్ , శివ, దుర్గా, ప్రసాద్, వెంకటసాయి, శివారెడ్డి, నాని, వంశి తదితరులు పార్టీలో చేరినవారిలో ఉన్నారు.



పార్టీలో చేరిన వారితో మంత్రి విడదల రజిని, లేళ్ల అప్పిరెడ్డి

సంక్షేమ సారథిని గెలిపించుకుందాం

- వైఎస్సార్ సీపీ లోక్‌సభ అభ్యర్థి కిలారి రోశయ్య
- గుంటూరులో వాకింగ్ ట్రాక్‌లో పర్యటన

పట్నంబజారు: ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య శనివారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని శ్రీ పుట్టపర్తి సాయిబాబా ఆశ్రమంలోని వాకింగ్ ట్రాక్‌లో పర్యటించారు. స్థానికులతో కలిసి తిరుగుతూ.. వారితో మమేకమై.. రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. వాకింగ్ ట్రాక్‌కు సంబంధించిన సమస్యలు, ఏదైనా పనులు చేయాల్సి ఉందా అని వాకర్సను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలారి రోశయ్య మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు సాగారన్నారు. ముఖ్య పేద వర్గాలను తన సొంత మనుషుల్లా భావించి పరిపాలనను వారి గడప వద్దకు చేర్చారన్నారు. రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అధికారులు ప్రజలకు వద్దకు వచ్చే పాలనను తీసుకునివచ్చారన్నారు. సచివాలయాల వ్యవస్థ ద్వారా గ్రామ స్వరాజ్య దిశగా అడుగులు వేశారన్నారు. అన్నివర్గాలకు మేలు చేసిన జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా తనని, ఏడు నియోజకవర్గాల అసెంబ్లీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్ సీపీ విజయం తథ్యం

లోక్‌సభ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య

పట్నంబజారు: మళ్లీ వైఎస్సార్ సీపీ విజయం తథ్య మని పార్టీ లోక్‌సభ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 42వ డివిజన్ విద్యానగర్‌లో పార్టీ డివిజన్ అధ్యక్షుడు చల్లా శేషిరెడ్డి ఆధ్వర్యంలో అపార్ట్‌మెంట్ వాసులతో ఆత్మీయ సమావేశం శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి రోశయ్యతో పాటు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, శాసన మండలి విప్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, పశ్చిమ ఎమ్మెల్యే, పార్టీ నగర అధ్యక్షుడు మద్దాళి గిరిధర్, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు(లాలుపురం రాము) ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. రోశయ్య మాట్లాడుతూ మరో వారం రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వార్ వన్‌సైడ్ అని, వైఎస్సార్ సీపీ విజయం తథ్యమన్నారు. చంద్రబాబు అండ్ కో ఎన్ని బూటకపు హామీలిచ్చిన ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ మంచి చేస్తేనే ఓటు వేయండ మ్మా అని అడిగే ధైర్యం రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌కు తప్ప మరెవ్వరికి లేదన్నారు. స్థానిక నేతలు గిరిష్‌రెడ్డి, ఉయ్యూరు రామకృష్ణారెడ్డి, చింతపల్లి రమణ, బత్తుల దేవానంద్ పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాలకు చెక్కుల పంపిణీ

నగరంపాలెం: పోలీస్ కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని ఏఎస్పీ జీవీ రమణమూర్తి శనివారం అంజదేశారు. అనారోగ్య కారణాలతో ఇటీవల ఎస్ఐ డి.ప్రసాద్ రావు(ఏఆర్), ఏఎస్ఐ కె.శివశంకరరావు(పెదకాకాని పీఎస్), హెడ్ కానిస్టేబుల్ (హెచ్‌సీ–డీసీఆర్‌బీ) సీహెచ్ శ్రీనివాసరావు మృతి చెందారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు ప్రసాద్‌రావు భార్య రమ్యకృష్ణకు లక్ష రూపాయల చేయూత, వీడియో ఫండ్ రూ.50 వేలు, ఫ్లాగ్‌ఫండ్ రూ.25 వేలు, శివశంకర్‌రావు కుమార్తె జ్యోతికి లక్ష రూపాయల చెక్కు, శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు లక్ష రూపాయల చెక్కును డీపీఓలో జిల్లా ఏఎస్పీ (పరిపాల న) జీవీ.రమణమూర్తి అందించారు. డీపీఓ ఏఓ వెంకటేశ్వరావు, పి.సెక్షన్ సూపరింటెండెంట్ రమాదేవి, పోలీస్ అసోసియేషన్ సభ్యులు హుస్సేన్ పాల్గొన్నారు.



నవ్వుతో వ్యాధులు దూరం

గుంటూరు మెడికల్: ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కొత్తపేటలోని ఎస్‌వీఆర్ షుగర్ హాస్పిటల్‌లో లాఫ్టర్ యోగ ప్రదర్శన, షుగర్ వ్యాధి చికిత్సలో నవ్వుల పాత్ర అంశంపై సదస్సు శనివారం నిర్వహించారు. సదస్సులో లాఫ్టర్ యోగ లీడర్ డాక్టర్ వి.వి.రామ్‌కుమార్ మాట్లాడుతూ నవ్వడం వలన మంచి ఆరోగ్యం లభిస్తుందని చెప్పారు. ఎక్కువ మంది నేడు ఒత్తిడితో బాధపడుతున్నారని చెప్పారు. గుంటూరులో డాక్టర్స్ స్మైల్ క్లబ్ ద్వారా డాక్టర్ కమల ఆధ్వర్యంలో లాఫ్టర్ యోగ తరగతులు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ రామ్‌కుమార్ వెల్లడించారు.



కోత కుట్టు లేకుండా పసరతిత్తి నాళంలో రాళ్లు తొలగింపు

- గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యుల ప్రతిభ
- అభినందించిన సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్

గుంటూరు మెడికల్: కోత కుట్టు లేకుండా పసరతిత్తి నాళంలో రాళ్లు తొలగించి జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యుల బృందం ప్రతిభ చాటింది. వివరాలు.. పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన ఆదెమ్మ పచ్చకామెర్లతో ఏప్రిల్ 17వ తేదీన గుంటూరు జీజీహెచ్‌లోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీకి వచ్చారు. రోగికి వివిధ పరీక్షలు చేసి వార్డులో చేర్పించారు. డాక్టర్ కవిత, డాక్టర్ నాగూర్‌బాషా పరీక్షించి పసరతిత్తి నాళంలో మూడు సెంటిమీటర్ల రాళ్లు ఉన్నాయని నిర్ధారించారు. ఈ రాళ్లను ఈ ఆర్‌సీపీ ద్వారా తీయాలని నిర్ణయించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ వెల్లడించారు. ఏప్రిల్ 24న మత్తు ఇచ్చి బలూన్ ద్వారా విజయవంతంగా రాళ్లను తీశారు. రోగి ఆరోగ్యంగా ఉండటంతో ఈ నెల 5న డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. రోగికి రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీద్వారా శస్త్రచికిత్స చేసినట్లు తెలిపారు. రోగి ఆరోగ్యవంతంగా ఇంటికి పంపించిన వైద్యులను శనివారం అభినందించారు. చికిత్స చేసేందుకు డాక్టర్ శివరామకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అనిల్ కుమార్, పీజీ వైద్యులు, మత్తు వైద్యులు ఎం.పోలయ్య, విష్ణు మహేష్ పాల్గొన్నారు.



శస్త్రచికిత్స అనంతరం కోలుకున్న ఆదెమ్మతో డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ నాగూర్‌బాషా

ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ అప్పగింత

గుంటూరు మెడికల్: ఊపిరి పీల్చుకోవడం ఇబ్బందిగా ఉన్న ఓ రోగి గుంటూరు జీజీహెచ్‌కు వచ్చింది. చికిత్స అనంతరం రోగికి అవసరమైన వైద్య పరికరం ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌ను రోగి ఇంటికి జీజీహెచ్ వైద్యులు పంపించారు. ఆరు నెలల అనంతరం రోగి కుదుటపడడంతో ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్‌ను రోగి బంధువులు శనివారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ మహిళ తండ్రి చంద్ర శేఖర్ ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ ను ఇంట్లో ఉంచుకోకుండా తిరిగి ఆసుపత్రికి ఇవ్వడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ ఎం ఓ డాక్టర్ బత్తులవెంకట సతీష్ కుమార్, జనరల్ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సింధూర పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు కడపలో ట్యాలీ, కంప్యూటర్ నైపుణ్యంపై ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి హరిప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన 18 నుంచి 26 ఏళ్ల లోపు వయసు ఉన్న అభ్యర్థులకు కడపలో 35 రోజుల పాటు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. ట్యాలీ ప్లస్ జీఎస్టీ, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్‌తో పాటు వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై అత్యుత్తమ శిక్షణ కల్పించి, శిక్షణానంతరం వివిధ సంస్థల్లో నెలకు రూ.15 వేలకు పైబడిన వేతనంతో నూరు శాతం ఉద్యోగాలను చూపిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 90004 87423 నంబర్లో సంప్రదించాలని కోరారు.

ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య



హత్యకు గురైన ప్రేమ్‌కుమార్(ఫైల్)

పట్నంబజారు: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో కలలసి భర్తను హతమార్చిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. బుచ్చయ్యతోటలో నివాసం ఉండే కుక్కమూరి ప్రేమ్‌కుమార్(30) ఆర్టీసీ బస్టాండ్ వద్ద పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో ప్రకాశం జిల్లాకు చెందిన ప్రేమ్‌కుమార్, అతడి భార్య భారతితో కలసి మూడేళ్ల క్రితం గుంటూరు వచ్చి బుచ్చయ్యతోటలో నివాసం ఉంటున్నారు. ఈనేపథ్యంలో భారతి లాలాపేట ప్రాంతానికి చెందిన గౌస్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. గుర్తించిన ప్రేమ్‌కుమార్ పలు మార్లు భారతిని వారించాడు. అయితే వివాహేతర సంబంధానికి భర్త అడ్డు వస్తున్నాడని, అతడి హతమార్చేందుకు సిద్ధమయ్యారు. గతనెల 28వ తేదీన గౌస్, ప్రేమ్‌కుమార్‌ను మద్యం తాగుదామని చెప్పి తీసుకెళ్లి, వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు ఖాళీ స్థలంలో మరో ఇద్దరితో కలసి హతమార్చాడు. అయితే తన భర్తను హతమార్చాలని భారతి, గౌస్‌ను కోరడంతో పక్కా ప్లాన్ చేసుకుని హత్య చేశారు. అనంతరం 28వ తేదీ రాత్రి తన భర్త కనిపించడం లేదంటూ భారతి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు కాల్ డేటా ఆధారంగా భారతి, గౌస్‌తో పలు మార్లు ఫోన్ మాట్లాడడాన్ని గుర్తించిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. అయితే భారతి, హత్యకు పాల్పడిన గౌస్ పోలీసులు అదుపులో ఉన్నట్లు సమాచారం. మరో ఇద్దరు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.